RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 24 | పేజీలు : 4 | మంగళవారం 28 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

- మయన్మార్‌లో కొత్త చట్టం
- ఆన్‌లైన్ మోసాలపై మయన్మార్‌లో కఠిన చట్టం
- బలవంతపు స్కామ్‌లకు పాల్పడితే ఇకపై మరణశిక్ష
- స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు యావజ్జీవ కారాగార శిక్ష
- యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లుకు మయన్మార్ పార్లమెంట్ ఆమోదం

### దేశంలోనే తొలిసారిగా అమరావతిలో

# ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్

ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం

ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా, ఇతర దిగ్గజ సంస్థల ఒప్పందం

అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు

ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు

దేశంలోనే తొలిసారిగా ప్రెసిషన్ ఆంకాలజీ విధానం ప్రారంభం

అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్ దిగ్గజ సంస్థలైన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రాజెనెకా ఇండియా, అమరావతిలో 'ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ సేవలను అందిస్తారు. దీనివల్ల కేన్సర్ చికిత్సలో కచ్చితమైన, వేగవంతమైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం స్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

- ఆగస్టు 3న సోషల్ మీడియా ప్రతినిధులతో భేటీ
- మెటా, గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ ప్రతినిధులు హాజరుకావాలని నోటీసులు
- ప్రధాని వీడియో తొలగింపు వివాదం నేపథ్యంలో కీలక పరిణామం

## తెలంగాణ టీవీ అవార్డులకు పీవీ పేరు?

మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన

తెలంగాణ టీవీ అవార్డులపై ప్రభుత్వం కసరత్తు

అవార్డులకు పీవీ పేరు పరిశీలన

సీఎం రేవంత్‌తో చర్చించి తుది నిర్ణయం

లోగో, కేటగిరీలపై సమీక్ష



తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్స హించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు.

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు

చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య



తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేకపోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



## పేపర్ లీకేజీల నిరోధానికి కఠిన చట్టం..

- రూ.10 కోట్ల వరకు జరిమానా
- లోక్‌సభలో పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చ
- వ్యవస్థీకృత ముఠాలకు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే ప్రతిపాదన
- నేరానికి పాల్పడిన వారికి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష
- కేసుల విచారణకు ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటు

## 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలి



శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రేవంత్ రెడ్డి భేటీ..

గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం

గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలి

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్' 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..

ప్రపంచంలోనే అతిపెద్ద మాగ్నెట్ పరీక్ష విజయవంతం

కృత్రిమ సూర్యుడి దిశగా చైనా ముందడుగు

ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యూజన్ మాగ్నెట్‌ను విజయవంతంగా పరీక్షించిన శాస్త్రవేత్తలు

10 కోట్ల డిగ్రీల ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఇది కీలకం

అణు సంలీనం ద్వారా పరిశుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యం

## జనసంద్రమైన సింహాచలం..

వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ

ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం

అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం

10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా

భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



మంగళవారం 28 జూలై 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# లోకేష్ తో.. నిమ్మల అంబరీష్ భేటీ

## దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటుకు విజ్ఞప్తి.



**గోరంట్ల జులై 28 సీమ వార్త సాయంత్రం.** తెలుగుదేశం పార్టీ (టిడిపి) రాష్ట్ర కార్యదర్శి నిమ్మల అంబరీష్, రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే దేవాంగ సామాజిక వర్గ సంక్షేమం మరియు అభివృద్ధి కోసం 'దేవాంగ కార్పొరేషన్' ను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా విన్నవించారు. దీనిపై మంత్రి శ్రీ నారా లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ, వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.







## అక్రిడేషన్ల మంజూరులో

# న్యాయం చేయండి..!!

.... పక్క జిల్లాలను అనుసరించి సత్య సాయి జిల్లాలోనూ చిన్న పత్రికలకు అక్రిడేషన్లు ఇవ్వండి.

....జిల్లా అక్రిడేషన్ కమిటీ ఏకాఅభిప్రాయానికి వస్తే .... ఎంతోమంది జర్నలిస్టులకు న్యాయం జరుగుతుంది.

......రెండవ విడత మంజూరైన అక్రిడేషన్లు ను మరింతగా పెంచాలన్న అంశం పై కలెక్టర్ తో చర్చ.

.... సానుకూలంగా స్పందించిన కలెక్టర్... ఎడిటర్ల ప్రతిపాదనను పరిశీలించి న్యాయం చేస్తాం.

.... రూల్స్ తో పాటు పక్క జిల్లాల పంపిణీని పరిశీలించండి..... సమాచార శాఖ ఏడి ని ఆదేశించిన కలెక్టర్.

.... హాజరైన...జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్లు... పుల్లయ్య, శ్రీనివాసులు, రమణ, జిల్లా కార్యదర్శి బాబు.

.... పాల్గొన్న జిల్లా చిన్న పత్రికల అధ్యక్షులు... గోరంట్ల బీరే ఈశ్వరయ్య, రాష్ట్ర నాయకులు పూల చలపతి, చౌడప్ప.





# "పల్లె" యువతలో టాలెంట్‌కు కొదవ లేదు..!!

...అమరావతి చాంపియన్ షిప్ నియోజవర్గ స్థాయి పోటీలను ప్రారంభించిన... పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

.....12 క్రీడంశాల్లో ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను వెలికితీసే భాగమే ఈ పోటీలు నిర్వహణ.

....మన గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదు

....వీరిని ప్రోత్సహిస్తే పతకం గ్యారెంటీ.

...కొత్తచెరువు ప్రభుత్వ పాఠశాలలో అమరావతి చాంపియన్ షిప్ నియోజవర్గ స్థాయి పోటీలు

.....ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి







**కొత్తచెరువు జులై 28 సీమ వార్త సాయంత్రం.** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలను పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సోమవారం కొత్తచెరువు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, మొత్తం 12 క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన అవకాశాలు, శిక్షణ, ప్రోత్సాహం కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, విద్యార్థులు, యువ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## 70 ఏళ్ల తర్వాత....

## 140 దేశాల్లో 4 నెలల పాటు

# ఎల్ నీనో ప్రభావం

....కరువు సవాల్ ను సమిష్టిగా ఎదుర్కొందాం..!!

.....ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి.

.... పెనుగొండ ఆర్డిఓ కార్యాలయంలో మంత్రి సవితమ్మ సమీక్ష.









**పెనుకొండ, జూలై 28 సీమ వార్త సాయంత్రం.** ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలోని భువన విజయం సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రపంచంలోని సుమారు 140 దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉండనున్నట్లు, రాబోయే నాలుగు నెలల పాటు దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారని మంత్రి సవిత తెలిపారు. దాదాపు 70 సంవత్సరాల తర్వాత తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు కొత్తగా బోర్లు వేయకుండా, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆచితూచి పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ వర్షపాతానికి అనుకూలమైన పంటలు, ముఖ్యంగా చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.. గ్రామాల్లో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును ఆదా చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వి బి జి రాంజీ పథకంను రైతులు ఉపయోగించుకోవాలని అలాగే ఈ పథకంలో పని దినాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో గ్రామాల్లో వ్యవసాయ తోటలకు గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు.. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు ఎదురయ్యే విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ మంచినీటి సరఫరా కోసం ?11.50 కోట్లతో ఆమోదం పొందిన ఆర్డబ్ల్యూఎస్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావాన్ని ప్రభుత్వం, అధికారులు, రైతులు, ప్రజలు అందరి సమిష్టి కృషితో సమర్థంగా ఎదుర్కొని కరువు పరిస్థితులను అధిగమించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ రావు రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

సీమ వార్త సాయంకాలం
మంగళవారం
28 జూలై 2026

# అక్రిడేషన్ల మంజూరులో న్యాయం చేయండి..!!

పుట్టపర్తి జులై 28 సీమ వార్త సాయంత్రం.
శ్రీ సత్య సాయి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు మంజూరు చేస్తున్న అక్రిడేషన్ల మంజూరులో తీవ్ర అన్యాయం జరుగుతుందని కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ల మంజూరు సంఖ్యను పెంచాలని జిల్లా చిన్న పత్రికలు మరియు మధ్యమ పత్రికల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా చిన్న పత్రికల అధ్యక్షులు గోరంట్ల బీరే ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి రాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ పుల్లయ్య, జిల్లా కార్యదర్శి బాబు, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్లు ధర్మవరం శ్రీనివాసులు, వెంకటరమణ మరియు యూనియన్ సీనియర్ నాయకులు చౌడప్ప, పూల చలపతి ల ఆధ్వర్యంలో జిల్లాలోని ఎడిటర్ల నేతృతంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ శ్యాం ప్రసాద్కు అందజేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం కలెక్టర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అక్రిడేషన్ కమిటీ మెంబర్ పుల్లయ్య, చిన్న పత్రికల జిల్లా అధ్యక్షులు గోరంట్ల ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు పూల చలపతి తదితరులు మాట్లాడుతూ చిన్న పత్రికలకు మంజూరు చేసే అక్రిడేషన్ల విషయంలో జిల్లాలోని అనేకమంది ఎడిటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అనంతపురం జిల్లాలో అక్కడ స్థానికంగా నమోదైన ఆర్ఎన్ఐ ఉన్న ఎడిటర్లకు 4



అక్రిడేషన్లు మంజూరు చేస్తున్నారని అదే సత్య సాయి జిల్లాలో రెండు మాత్రం ఇస్తున్నారని, గతంలో వార, పక్ష, మాస పత్రికలకు వన్ ప్లస్ వన్ అక్రిడేషన్లు మంజూరు చేసే వారిని ఇప్పుడు మాత్రం ఆ విధానాలను ఈ జిల్లాలో అమలు చేయడం లేదని కలెక్టర్కు గుర్తు చేశారు. ప్రస్తుతము జులై నెల వరకు పత్రికల అటెండెన్స్ డే ను పరిగణలోనికి తీసుకొని వ్యాయం చేయాలని అనంతపురం జిల్లాలో నెలకు 19 రోజులు చొప్పున పరిగణలోకి తీసుకున్నారని ఇక్కడ అదే విధానాన్ని అమలు చేయాలని,గత 20, 30 ఏండ్ల నుండి ప్రముఖ పత్రికలలో పనిచేసిన సీనియర్ జర్నలిస్టులు స్వంతగా పత్రికలను ఏర్పాటు చేసుకొని సీనియర్ జర్నలిస్టులుగా కొనసాగుతున్నట్లు గుర్తు చేశారు. జర్నలిజాన్ని వదులుకోలేని పరిస్థితులలో స్వంత పత్రికలు స్థాపించుకున్నామని,.ప్రధాన దిన పత్రికలకు 3 నెలల పేపరు కటింగ్ ప్రామాణికంగా తీసుకొని అక్రిడిటేషన్లు మంజూరు చేస్తున్నా తరహాలోనే చిన్న మరియు మీడియం, దిన పత్రకలకు మంజూరు చేయాలని కోరారు. అలాగే వార, పక్ష మరియు మాప పత్రికలకు సైతం ఇస్తున్న ఒకే ఒక అక్రిడిటేషన్ మంజూరు చేశారు. అయితే మా చిన్న పత్రికలకు 11 అక్రిడిటేషన్ మంజూరు చేయాలని కోరారు.

**కలెక్టర్ ఏడికి ఆదేశాలు...**

జిల్లాలోని చిన్న పత్రికల ఎడిటర్లు అక్రిడేషన్ల మంజూరు విషయంలో కలెక్టర్కు చేసిన పలు సూచనలు అభ్యర్థులపై కలెక్టర్ శ్యాం ప్రసాద్ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలతో పాటు పక్క జిల్లాల్లో అక్రిడేషన్లు మంజూరు చేస్తున్న విధానాన్ని తెలుసుకొని ఈ జిల్లాలోని ఎడిటర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ ఏడి భరత్ కుమార్ రెడ్డి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాధరణ గంగాధర, సోమందేపల్లి జాకీర్, శంకర్, శ్రీనివాసులు, వాసు,రాజు, పెద్దన్న, మడకశిర గోవిందప్ప, శంకర్, సోమందేపల్లి కళ్యాణి శ్రీనివాసులు, దొడ్డప్ప, గోవర్ధన్ రెడ్డి, సంజయ్ కుమార్, షేక్షా వలి, గాండ్లపెంట శ్రీరాములు, నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ హంట్...
# భయపడుతున్న అవినీతి అధికారులు

**హైదరాబాద్ :** పుట్టల నుంచి పాములు బయటికి వస్తున్నాయి అనే విధంగా తెలంగాణలో అవినీతి అధికారుల బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో ఏసీబీ దాడులు ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా సాగుతున్నాయి. ఇన్నాళ్లుగా చిన్న స్థాయి అధికారుల మీద పడ్డ శాఖ ఇప్పుడు పెద్ద తలకాయల మీద దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏసీబీకి పూర్తి స్థాయి స్వేచ్ఛ ఇవ్వడంతో అధికారులు ఎవరిని వదిలిపెట్ట కుండా దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేవలం సాధారణ తనిఖీలు కాకుండా పక్కా సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న లంచావతారాలను పట్టుకోవడానికి ఏకంగా ఒక పెద్ద వ్యూహాత్మక ఆపరేషన్ను ప్రారంభించారు.అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇప్పటివరకు ప్రధానంగా రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, ఎలక్ట్రిసిటీ, మున్సిపల్, పోలీస్ శాఖల మీదనే ప్రధానంగా దృష్టి సారించారు. ఈ దాడులలో పట్టుబడిన వారిలో ఎక్కువగా గ్రూప్ వన్, గ్రూప్ టూ కేడర్కు చెందిన అధికారులే ఉన్నారు. అయితే ఇప్పుడు క్షేత్రస్థాయి అధికారులతో పాటు ఏకంగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల అవినీతి బాగోతం మీద కూడా ఏసీబీ దృష్టి సారించినట్లు స్పష్టమైన సమాచారం వస్తోంది. ఇటీవల పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీ సంగిరెడ్డి భీమిరెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది. సరిగ్గా 2019 నాటి పాత కేసను మళ్లీ తవ్వి తీసిన పోలీసులు అతని అక్రమ సామ్రాజ్యాన్ని మొత్తం బట్టబయలు చేశారు. కేవలం ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఏకంగా నూట యాభై కోట్ల రూపాయలకు పైగా అక్రమ ఆస్తులను కూడబెట్టడం అందరినీ విస్మయానికి గురిచేసింది.ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లో పనిచేసిన ఒక ఏఈ స్థాయి అధికారి కూడా నూట యాభై కోట్ల రూపాయలకు పైగా అక్రమ ఆస్తులతో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్గా దొరికిపోయాడు. అయితే వీరంతా కూడా కేవలం బినామీలు మాత్రమేనని, అసలు సూత్రధారులు,



పాత్రధారులు తెరవెనుక వేరే ఉన్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. కొంతకాలంగా కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరు తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. వారంతా నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఆస్తులు సంపాదించారనే పక్కా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు సమగ్రమైన వివరాలు సేకరించి రంగంలోకి దిగారు. అక్రమంగా సంపాదించిన అధికారుల చిట్టా మొత్తం సిద్ధం చేసుకున్న అధికారులు త్వరలోనే వారిని అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర బ్యూరోక్రసీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.తెలంగాణ అవినీతి నిరోధక శాఖ దాడుల వెనుక సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుగులేకుండా చెలామణి అయిన కొందరు ఉన్నతాధికారులు ఇప్పుడు ఏసీబీ నిఘా నీడలో భయంతో వణికిపోతున్నారు. పదేళ్ల కాలంలో విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్న నాయకులకు కొమ్ముకాసిన కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇప్పుడు ఏసీబీ ఉచ్చులో చిక్కుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పాముల వేట ముగిసి ఇప్పుడు అసలైన అనకొండల గుట్టు రట్టవుతుండటంతో రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా వేల కోట్ల విలువైన బినామీ ఆస్తులను జప్తు చేసే దిశగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఈ దాడులతో కింది స్థాయి ఉద్యోగులు సైతం లంచాలు తీసుకోవడానికి భయపడేలా అధికార యంత్రాంగంలో ఒక సరికొత్త భయం, స్పష్టమైన మార్పు స్పష్టంగా కనిపిస్తున్నాయి

# డ్రోన్ అకాడమీ...

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం డ్రోన్ అకాడమీ ద్వారా డీజీసీఏ సర్టిఫైడ్ శిక్షణను అందిస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు ఉన్న సర్టిఫికెట్తో పాటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. : సినిమాల్లో కనిపించే అద్భుతమైన డ్రోన్ షాట్లు, రాజకీయ ర్యాలీల్లో తీసే ఏరియల్ వీడియోలు చూసి చాలా మంది డ్రోన్ ఎగరేయాలని అనుకుంటుంటారు. అయితే డ్రోన్ను ప్రొఫెషనల్గా నడపడం ఒక ప్రత్యేక నైపుణ్యం. అలాంటి వారికి తెలంగాణ ప్రభుత్వం డ్రోన్ అకాడమీ ద్వారా డీజీసీఏ సర్టిఫైడ్ శిక్షణను అందిస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు ఉన్న సర్టిఫికెట్తో పాటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. అయితే, ఆధాయం విషయానికి వస్తే.. డ్రోన్ పైలెట్ ఆదాయం మీరు ఎంచుకున్న రంగాన్ని బట్టి మారుతుంది. వేలల్లో నుంచి లక్షల్లో కూడా ఆదాయం లభిస్తుంది.డ్రోన్ అంటే కేవలం ఒకే రకం కాదు. వినియోగాన్ని బట్టి అనేక రకాల డ్రోన్లు ఉంటాయి. వాటి పనితీరు, వినియోగం, భద్రతా నియమాలు, ఆపరేషన్ విధానాలపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి సర్టిఫికెట్ అందుతుంది. దేశంలో విమాన పైలెట్లకు కూడా ఇదే సంస్థ గుర్తింపు ఇస్తుండటంతో ఈ సర్టిఫికెట్కు మంచి ప్రాధాన్యం ఉంది.తెలంగాణ ప్రభుత్వం దీనికోసం ఒక వెబ్సైట్ తీసుకొచ్చింది. ఈ వెబ్ సైట్ లోకి వెళితే మీకు అందులో ఆప్షన్స్ వస్తాయి.
అందులో ఎన్ రోల్ ఆప్షన్ ఉంటుంది. దాని మీద క్లిక్ చేస్తే మీకు ఈ సంస్థ అందిస్తున్న కోర్సుల డిటెయిల్స్ కనిపిస్తాయి.



**అందుబాటులో ఉన్న కోర్సులు..**

డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ ఈ కోర్సులో చిన్న, మధ్య తరహా డ్రోన్లను సురక్షితంగా టేకాఫ్, ల్యాండింగ్, టర్నింగ్ చేయడం నుంచి పూర్తి స్థాయి ఆపరేషన్ వరకు నేర్పిస్తారు. డ్రోన్ పైలెట్గా కెరీర్ ప్రారంభించాలనుకునే వారికి ఇది ఉత్తమ కోర్సు.

**రెండు రోజుల డ్రోన్ వర్క్షాప్..**

ఇప్పటికే డ్రోన్ ఎగరేయడం తెలిసిన వారికి అడ్వాన్స్డ్ టెక్నిక్స్, కొత్త మోడళ్లపై అవగాహన కల్పించే శిక్షణ.వ్యవసాయ డ్రోన్ల ద్వారా పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసే విధానం నేర్పిస్తారు. డ్రోన్ ట్యాంక్ నింపడం, సమానంగా స్ప్రేయింగ్ చేయడం, సురక్షిత వినియోగంపై శిక్షణ ఉంటుంది.డ్రోన్ కెమెరా ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానం నేర్పిస్తారు. పోలీస్ శాఖ, రాజకీయ ర్యాలీలు, పెళ్లిళ్లు, ఈవెంట్లు, వీడియో షూటింగ్లకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.డ్రోన్ ద్వారా భూసర్వే, మ్యాపింగ్, డేటా విశ్లేషణ వంటి నైపుణ్యాలు నేర్పిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, ప్రభుత్వ సర్వేల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది.వ్యవసాయ డ్రోన్లను అసెంబుల్ చేయడం, లోపాలు గుర్తించడం, మరమ్మతులు చేయడం వంటి సాంకేతిక శిక్షణ అందిస్తారు.డ్రోన్ రంగంలో అత్యధిక అవకాశాలు ఉన్న విభాగాల్లో డ్రోన్ మ్యాపింగ్ ఒకటి. భూముల విస్తీర్ణం, వ్యవసాయ క్షేత్రాలు, నిర్మాణ స్థలాల సర్వే, మ్యాపింగ్ వంటి పనులు ఇందులో భాగం. సాంకేతిక పరిజ్ఞానం, విశ్లేషణా నైపుణ్యం ఉన్న వారికి ఈ విభాగంలో మంచి ఆదాయం, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి

## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్బుక్, గూగుల్, ఎక్స్లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్ఫామ్ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## నా తల్లి ఆశీస్సుల తో అన్నదానం

**గర్భిణీ స్త్రీల ఆకలి తీర్చడం నా పూర్వ జన్మ పుణ్యం.**



**లేపాక్షి జులై 28 సీమ వార్త సాయంత్రం.** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతివారం జరిగే పరీక్షలకు విచ్చేసిన గర్భిణీ మహిళలకు రమా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో,ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, కరణం రమానందన్ మంగళవారం దాదా పు 65 మంది మహిళలకు ఉచి తంగా పౌష్టికాహారం అందజేసారు. ప్రతి వారం లాగే యథా విధిగా నిర్వహిం చడం జరిగింది. కరణం రమానందన్ వారి తల్లి పేరు మీద మాతృమూర్థులకు(గర్భిణి లకు ) భోజనం ఉచితంగా అందజేయడం నా అదృష్టం అని అయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, రమానందన్, మిత్ర మండలి పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యం లో సామాజిక శంఖారావం.



**లేపాక్షి జులై 28 సీమ వార్త సాయంత్రం.** లేపాక్షి మండల కేంద్రంలో మూడవ సచివాలయం నందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక శంఖా రావం కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో గతం నుండి ఇప్పటి వర కు డ్రైనేజీలు, సిసి రోడ్లు, వీధిలైట్లు, పబ్లిక్ కొళాయిలు వీటితోపాటు ఇప్పటి వరకు కాలనీలో నివసిస్తున్న వారు మరణిస్తే స్మశాన వాటిక లేదు గత 30 ఏళ్లు గా నోచుకో లేదు. ఎన్నో ప్రభు త్వాలు ,ప్రజాప్రతిని ధులు మారారు కానీ కాలనీలో నివసిస్తు న్న ప్రజలు సమ స్యలను పట్టించు కున్న వారు లేరు కానీ ఆ కాలనీలో ఇంటి గుత్తులు వాట ర్ బిల్లులు కట్టించు కునే విషయంలో ఉన్న శ్రద్ధ వారికి సౌకర్యాలు అందిం చడంలో మాత్రం మాకు సంబంధం లేదు..అనే పద్ధతు ల్లో ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికా రులు వ్యవహ రిస్తున్నారు. కాబట్టి ఇప్పటివరకు ఆ సమస్యలు పరిష్కా రం కాకుండా ఇంకా జటిల స్థాయికి చేరుకున్నాయి. అక్కడ నివసించడా నికి ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండే విధంగా ఆ కాలనీ తయారయింది. డ్రైనేజీలు సిస్టం లేకపోవడం వల్ల పాత్రలు కడిగిన బట్టలు ఉతికిన పక్కింటి దగ్గరకు ఆ నీరంతా చేరుకోవ డం వల్ల ఒక్కరికి ఒకరు అనేక సంద ర్భాల్లో ఘర్షణలు వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నా యి. ఈ రకంగా ఎవరికీ మనశ్శాంతి లేకుండా ఒకరిని చూస్తే మరొకరు సీదరించుకొనే పరిణామాలు చాలా పెరిగిపోయాయి. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో దశలవారీగా అనేక ఉద్యమాలను నిర్మిస్తామని సమస్య పరిష్కారమయేంతవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి నరసింహప్ప, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, సాదిక్, కవితలక్ష్మి, రామాంజనమ్మ, రుబాయి బాన్, అనూష, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మృతి పట్ల సంతాపం



**మడకశిర జూలై 28 సీమ వార్త సాయంత్రం** నియోజకవర్గ పరిధిలోని కేఎన్ పల్లి మాజీ సర్పంచ్ మహలింగప్ప మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో గుండెపోటుతో మరణించారు. కే.ఎన్. పల్లి గ్రామానికి చెందిన దళిత నాయకుడు, మాజీ సర్పంచ్ మహాలింగప్ప పరమపదించడం అత్యంత విషాదకరం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, శోకసంతప్త హృదయాలతో మా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కే. ఈరన్న , డా. ఎం. ఈరన్న సునీల్ , మాజీ ఎంపీపీ ఎల్.కే. నరసింహప్ప , ఎంఆర్పీఎస్ నాయకులు కెంచప్ప , నరసింహమూర్తి , ఎఫ్.ఏ. ఆనంద్ , జవనడుకు సిద్ధేష్ , మోపురగుండు శివ , మోర్బాగుల్ సుదర్శన్ , ఈశ్వరప్ప , చిగతుర్పి రఘు,హనుమంతరాయ తదితరులు పాల్గొని మహాలింగప్ప గారికి నివాళులర్పించారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




**సోమందేపల్లి జూలై 28 సీమ వార్త సాయంకాలం** ప్రభుత్వం మంజూరు చేసిన యూరియా బస్తాలను పందిపర్తి గ్రామ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాస రెడ్డి,గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని యూరియాను స్వీకరించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ యూరియా పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

## ప్రజల్లో.... రెండేళ్లలో నమ్మకాన్ని పెంచుకున్నాం.

మల్లా పల్లి పంచాయతీ కలగేరి లో ఇంటింటి తెలుగుదేశం ప్రచారం.

టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



**గోరంట్ల జూలై 28 సీమ వార్త సాయంత్రం.** “2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం” ఇంటింటి ప్రచార కార్యక్రమం 2వ రోజును నేడు మల్లాపల్లి పంచాయతీ కళ్ళగేరి గ్రామంలో గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాల్లో కన్వీనర్ తో పాటు జిల్లా కార్యదర్శి నరేష్, స్థానిక నాయకులు మాజీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహులు, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, మల్లాపల్లి నరేష్ యాదవ్, మహమ్మద్,కలగేరి గంగిరెడ్డి,మల్లాపల్లి వెంకటరెడ్డి, వెంకట్ రెడ్డి రామాంజనేయరెడ్డి తదితరుల నేతృతంలో ఇంటింటికి టిడిపి కరపత్రాలు పంపిణీ చేశారు. సందర్భంగా గుత్తా బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్టీఆర్ భరోసా,సూపర్ సిక్స్,మరియు నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల సమస్యలు, తెలుసుకుని మై టిడిపి యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, మందలపల్లి గంగాధర్, సింగిల్ విండో అధ్యక్షులు పాయల రమణ, కాగానపల్లి వెంకటేష్, జనసేన రమేష్,కలగేరి గంగిరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్ చరణ్ బాగు కై...ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.

**కదిరిలో మెగా యూత్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పూజలు**



**కదిరి జూలై 28 సీమ వార్త సాయంత్రం.** తెలుగు చలన చిత్ర అగ్ర నటుడు సినీ ఖ్యాతిని ప్రపంచానికి తెలిసేలా అబిమానులను సొంతం చేసుకున్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి పెద్ది మూవీ షూటింగ్ సమయంలో గాయం అవ్వడం వల్ల నిన్నటి రోజున చెన్నై మహా నగరం కోయంబత్తూరులో ఆయన చేతి మణికట్టుకు జరిగిన సర్జరీ విజయవంతం అవ్వడం ప్రతి మెగా అభిమానికి సంతోషాన్ని కలిగించింది.రామ్ చరణ్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సాధ్యం అయినంత తొందరగా కోలుకొని సినీ ప్రేక్షకులను , మెగా అభిమానులను అలరించాలని మనస్పూర్తిగా కోరుకుంటూ మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.శ్రీ వారి ఆలయ అర్చకులు శ్రీ రామ్ చరణ్ గారి పేరు మీద అర్చన చేసి ఆయన శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో తొందరగా కోలుకోవాలని పూజలు చేశారు.ఈ పూజా కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ స్టేట్ కో కన్వీనర్ కడపల సుధాకర్ రెడ్డి , అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు లక్ష్మణ కుటాల మరియు కదిరి నియోజక వర్గం మెగా అభిమానులు మనోహర్ , కార్తీక్ , రాజేంద్ర ప్రసాద్ , హరి బాబు , రాచెరువు వెంకటేష్ , రామ్మోహన్ ,అలకుంట వెంకటేశ్వర్లు , మిథున్ , ఆకుల హరి ప్రసాద్ , సుధాకర్ , సోమశేఖర్ , ముని గోపాల్ , అడపాల వెంకటేష్ , ప్రశాంత్ రాయల్ , మంకముతక సురేష్,విక్కి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటేటా అనాధల అండగా... రమేష్ రెడ్డి స్వర్ణలక్ష్మి.

**....శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమం లో నిత్యవసరుకులు పంపిణీ.**




**ఆమడగూరు జూలై 28 సీమ వార్త సాయంత్రం.** అమ డుగూరు మండలం గాజులపల్లి గ్రామం కూడలిలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి రమేష్ రెడ్డి (మోపురి), స్వర్ణలక్ష్మి (కదిరి) కలసి ఆశ్రమంలో నిత్య సరుకులు అందజేశారు. వీరు గత నాలుగు సంవత్సరాలుగా ఆశ్రమానికి నిత్య సరుకులు అలాగే సహాయ సహకారాలు అందించుతూ వచ్చారు వారి కుటుంబ సభ్యులు ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉండాలని వృద్ధుల తరపున ఆశ్రమం తరపున మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని రమేష్ రెడ్డి ని స్వర్ణలక్ష్మి ని కోరారు ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఎల్ నినోతో పంటలకు ముప్పు

పొటాషియం నైట్రేట్, ఫ్లోనికమైడ్ వాడాలని శాస్త్రవేత్తల సలహా



**తాడిపత్రి జులై 28 సీమ వార్త సాయంత్రం:** “పొలం పిలుస్తోంది” కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు మరియు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బ్రాహ్మణపల్లి, గంగాదేవిపల్లె, ఇగుడూరు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా పత్తిలో “బెట్ట” పరిస్థితులు ఉన్నాయి. దీన్ని అధిగమించేందుకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ం బోరాన్ 3 గ్రాములను 1 లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలని అన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఫ్లోనికమైడ్ మందును ఎకరాకు 60 గ్రాముల చొప్పున వాడాలి. గులాబీ రంగు పురుగు ఉధృతి ఉండటంతో ఎకరాకు 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంది, ఆముదం పంటల్లో

మొక్కల మధ్య 20 సెం.మీ దూరం ఉండేలా అధిక మొక్కలను తొలగించాలి. విత్తిన 30, 60 రోజులకు అంతర కృషి చేయడం వల్ల దిగుబడితో పాటు నేల తేమ నిలుస్తుంది.

తేలికపాటి నేల్లో జొన్న, కొర్ర, సజ్జ, పెసర, అలసంద, ఉలవలు. బరువైన నేలల్లో ఆముదం, కంది, జొన్న, కొర్ర, పెసర వేయాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు తెలిపారు. రైతులందరూ డబల్ యు బిసిఐయస్ మరియు పీఎంయఫ్ బివై పంటల భీమా పథకాల్లో నమోదు చేసుకోవాలని, నీటి పొదుపు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. కిషోర్, ఆర్ యస్ కే సిబ్బంది రవి పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



**తాడిపత్రి, జులై 28 సీమ వార్త సాయంత్రం:** తాడిపత్రి పట్టణ సమీపంలోని నందలపాడు – అనంతపురం రోడ్డులో సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాడిపత్రి నుండి అనంతపురం వెళ్లే రహదారిలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో లారీ, మోటర్ బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయ. యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన సంకెళ్ల నరేష్ రెడ్డి 35 తండ్రి ప్రహ్లాద రెడ్డి ప్రమాదంలో తలకు బలమైన రక్త గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా తక్షణమే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వలస పంచాయతీలో జోరుగా ఇంటింటికి కూటమి ప్రభుత్వం

మండల సింగల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్



**అమరాపురం జూలై 28 సీమవార్త సాయంత్రం** మండల పరిధిలోని విరుపసముద్రం గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి గడపకూ చేరవేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఇందులో భాగంగానే వలస పంచాయతీ పరిధిలోని విరుపసముద్రం గ్రామంలో ‘ఇంటింటికి కూటమి ప్రభుత్వం’ కార్యక్రమం అత్యంత జోరుగా సాగింది. ఈ కార్యక్రమంలో మండల సింగల్ విండో అధ్యక్షులు ఎన్. గణేష్ పాల్గొని కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాన్ని వివరించారు. నియోజకవర్గం శాసనసభ్యులు ఎమ్మెల్యేఎం.ఎస్. రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మరియు గ్రామస్థుల సమక్షంలో ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని భరోసా కల్పించారు. త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలోనూ, ప్రతీ గ్రామంలోనూ పసుపు జెండా ఎగరవేయడమే లక్ష్యంగా శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి విప్లవాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## తప్పిన పైన ప్రమాదం



**సోమందేపల్లి జూలై 28 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ లో ఎల్టీ లైన్ విద్యుత్ వైర్ తెగిపడింది. ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు స్పందించి తెగిపడిన విద్యుత్ వైరును లైన్ ఇన్స్ పెక్టర్ సూరి సిబ్బంది తో కలిసి మరమ్మత్తు చేశారు. దీంతో ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881